కాలనీల్లో తాగునీటి కట కట

- ఐదు నెలలుగా లో ప్రెషర్
- మోటర్ ఆన్‌చేస్తేనే నల్లా నీరు

బేగంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అసలే నీటి కొరత.. దీనికి తోడు కొన్ని నెలలుగా లో ప్రెషర్... దీంతో సరిపడా తాగునీరు సరఫరా కాకపోవడంతో కాలనీ, బస్తీలలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది సంవత్సరాలుగా తాగునీటి సమస్యకు దూరంగా ఉన్న బేగంపేట వాసులు ఆరు నెలల నుంచి తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ప్రకాశ్‌నగర్ వాటర్ వర్క్స్ సెక్షన్ పరిధిలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉంది. సరిపడా నీటి సరఫరా లేక పోవడంతో అధికారులు సైతం చేతులు ఎత్తేయడంతో స్థానికులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు.

వేసవి రాక ముందే తిప్పలు

వేసవి ఇంకా ప్రారంభం కాలేదు.. అప్పుడే తాగునీటి కొరత ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని ప్రకాశ్‌నగర్ వాటర్ వర్క్స్ సెక్షన్ పరిధిలోని బేగంపేట, రాంగోపాల్‌పేట ప్రాంతాలలో ఆరు నెలలుగా తాగునీరు సమస్య తీవ్రంగా ఉంది. ప్రధానంగా నీటి సరఫరా తక్కువగా రావడంతో పాటు ఆయా కాలనీలు, బస్తీలలోని చివరి ప్రాంతాలకు తాగునీరు అందడం లేదు. ఆయా కాలనీ, బస్తీ వాసులు అధికారులను, ప్రజా ప్రతినిధులను కలిసి వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. అయితే నీటి సరఫరా తక్కువగా ఉండడంతో తగినంత నీరు సరఫరా చేయలేక పోతున్నామని, దీనికి తోడు రోజు విడిచి రోజు రెండు గంటల పాటు జరిగే నీటి సరఫరా కేవలం ఒక గంటకే పరిమిత మైందని, దీని వల్ల తాగునీరు సరఫరా లేక పోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బేగంపేట డివిజన్‌లోని శ్యామ్ లాల్ బిల్డింగ్, బేగంపేట బస్తీ, బ్రాహ్మణవాడి, వడ్డె బస్తీ, మాతాజీనగర్ ప్రాంతాలలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రకాశ్‌నగర్, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్, వికార్‌నగర్, దేవుడి, ఎన్.బి.టినగర్, పాటిగడ్డ, ఓల్డ్ పాటిగడ్డలో నివసించే పేద, మధ్యతరగతి వాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రకాశ్‌నగర్ వాటర్‌వర్క్స్ సెక్షన్ మేనేజర్‌ను కలిసి నీటి సమస్యపై పలు వినతలు చేసినా సరఫరా సక్రమంగా జరగలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రాహ్మణవాడి, బేగంపేట బస్తీ, పాటిగడ్డకు చెందిన స్థానికులు ఇటీవల బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డిని కలిసి నీటి సమస్యను గురించి వివరించారు. ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా అధికార పార్టీ నేతలు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.



ప్రకాశ్‌నగర్ వాటర్ వర్క్స్ కార్యాలయం


తాగునీటి సమస్యపై బీజేపీ నేత మర్రి శశిదర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బ్రాహ్మణవాడి వాసులు యాదయ్య, రామచంద్రర్ (ఫైల్)

మోటార్లతో నీటి వినియోగం

లో ప్రెషర్‌తో తాగునీరు రావడంతో చాలా మంది అక్రమంగా నల్లాకు మోటార్లు బిగించి నీటిని తోడేస్తున్నారు. దీంతో వాటర్ వదిలిన కొంతసేపటికే మోటార్లు అన్ చేయడంతో చివరి ప్రాంతాలకు నీరు వెళ్లడం లేదు. లో ప్రెషర్ ఉన్న సమయంలో నీటి సరఫరాపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కొందరు లైన్‌మెన్లు కొన్ని ప్రాంతాలకు అధిక సమయం నీటిని వదలడం ఆ ప్రాంతాల్లో అక్రమంగా మోటార్లతో నీటి ని తోడుతున్నా చూసి చూడనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో సక్రమంగా నీటిని వదలక పోవడంతో సమస్య ఏర్పడుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

లో ప్రెషర్‌తోనే సమస్య..

ప్రకాశ్‌నగర్ వాటర్ వర్క్స్ సెక్షన్ పరధిలోకి వచ్చే తాగునీరు తక్కువగా రావడంతో దానిని అందరికి అందేలా చర్యలు తీసుకుంటున్నాం. సమయం తగ్గించి అన్ని ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేస్తున్నాం. వారం రోజుల క్రితం లో ప్రెషర్‌తో నీటి సరఫరా కావడంతో సమస్య నెలకొంది. వీలైనంత వరకు ప్రజలకు తాగునీరు ఇబ్బంది లేకుండా చూసేలా చర్యలు తీసుకుంటున్నాం.

-రామేశ్వరరావు, మేనేజర్
ప్రకాశ్‌నగర్ వాటర్ వర్క్స్ సెక్షన్




మధురానగర్ డీ-బ్లాక్ పార్కులో పునర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

హామీలను నెరవేరుస్తున్నాం

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

పంజాగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. సోమవారం వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ డి-బ్లాక్ పార్కులో రూ.16 లక్షలతో పార్క్ పునర్ నిర్మాణం పనులకు, జి-బ్లాక్‌లో రూ.15.50 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు. మధురానగర్ కాలనీని ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేదీప్య, జీహెచ్ఎంసీ డీఈ రామచంద్ర రాజు ,యూబిడి ఇన్స్పెక్టర్ విక్రమ్ చంద్ర, మధురానగర్ కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివ రావు,కోశాధికారి సుగుణ,ఉపాధ్యక్షుడు మనోహర్ రావు,దర్శకుడు రేలంగి నరసింహారావు, పద్మావతి, విజయవాణి,తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర పోరాట కమిటీ అధ్యక్షుడు అభిమాన్ గాంధీ నాయక్ ధరావత్

ఇద్దరికి మించి పిల్లలు ఉన్నవారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్న వారికి పోటీ చేసే అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర పోరాట కమిటీ అధ్యక్షుడు అభిమాన్ గాంధీ నాయక్ ధరావత్ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కన్నా ఎక్కువ సంతానం ఉన్న వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయకుండా తెచ్చిన 1995 చట్టాన్ని తొలగించి, వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని అన్నారు. .మంత్రివర్గ సమావేశంలో ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చర్చించి ఈ చట్టాన్ని తొలగించాలని, తమకు రాజకీయ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కమిటీ రాష్ట్ర నాయకులు ముడావత్ రేఖ్యా నాయక్, ఏడెల్లి భూపాల్, జగన్ భాటియా, చంద్రయ్య పాల్గొన్నారు.

హోంగార్డులను విధుల్లోకి తీసుకోవాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చిన్న చిన్న కారణాలతో విధుల నుంచి తొలగించిన హోంగార్డులను విధుల్లోకి తీసుకుని తమ జీవితాల్లో వెలుగులు నింపాలని పలువురు హోంగార్డులు రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్వీస్ నుంచి తొలగించబడిన హోంగార్డులు రామకృష్ణ, సురేష్, హ్యూమన్ రైట్స్ సెల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మహేందర్‌తో కలిసి తమ గోడును వినిపించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 250 మంది ఉండగా వారిలో హైదరాబాద్ సిటీకి చెందిన వారు 130 మంది వరకు ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వం చిన్న చిన్న కారణాలు, తప్పులు చూపించి తమను సర్వీస్ నుంచి తొలగించారని అన్నారు. దీంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని అప్పటి సీఎం, మంత్రులు, పోలీస్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని అన్నారు. న్యాయం కోసం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా తమకు న్యాయం చేయాలని, విధుల్లో తీసుకోవాలని చెప్పిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ట్రాన్స్ జెండర్స్‌ను ట్రాఫిక్ విధుల్లోకి తీసుకున్నారని, చిన్న చిన్న కారణాల వలన ఉద్యోగం కోల్పోయిన తమను మానవతా దృక్పథంతో ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. సీఎం న్యాయం చేస్తారని తమకు నమ్మకం ఉందని అన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ రవి శేఖర్ రెడ్డి తదితరులు

వినూత్న తరహాలో కాంగ్రెస్ నిరసన

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికారిక యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీవీ రవి శేఖర్ రెడ్డి ఎర్రగడ్డ కల్యాణ్‌నగర్ వెంచర్ త్రీ లోని బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలవేసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బడ్జెట్టులో తెలంగాణ రాష్ట్రానికి జరిగిన తీవ్ర అన్యాయానికి తెలంగాణకు చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది పార్లమెంటు సభ్యులు ఉన్నప్పటికీ బడ్జెట్లో తీవ్ర అన్యాయం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత ధోరణితోనే వ్యవహరించి నిధులు కేటాయించలేదని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగరాజు, మోసెస్, సురేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 1,975 దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 1,975 దరఖాస్తులు వచ్చాయి. డబుల్ బెడ్‌రూమ్‌లు కావాలని 1,279 మంది, రేషన్‌కార్డులకు 563, పింఛన్ల కోసం 33, విద్యాశాఖ సమస్యలపై 7, రెవెన్యూకు 7, పౌరసరఫరాలశాఖకు 7, మైనారిటీశాఖకు 4, వికలాంగులశాఖకు 4, ప్రణాళికశాఖకు 1, జీహెచ్ఎంసీకి 2, ఇతర శాఖలకు 68 దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కదివరన్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందజేసిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకటాచారి, ఆర్డీఓ సాయిరాం, డీఈఓ రోహిణి, డీఎంహెచ్‌ఓ వెంకటి, జిల్లా అధికారులు ఆశన్న, పవన్‌కుమార్, కోటాజీ, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

- డా. బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తాము పనిచేసే సంస్థలో నిబద్ధతగా ఉండాలని, చేసే పనిలో పారదర్శకత అవసరమని డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి అన్నారు. సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సీఎస్‌టీడీ) ఆధ్వర్యంలో ఇటీవల టీజీఎస్పీ ద్వారా నియమితులైన జూనియర్ అసిస్టెంట్ సిబ్బందికి వారం రోజుల పాటు నిర్వహిస్తున్న "ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ జూనియర్ అసిస్టెంట్స్" శిక్షణ కార్యక్రమాన్ని వీసీ సోమవారం వర్సిటీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో పనిచేసే సిబ్బంది ఎప్పటికప్పుడు ఆయా రంగాల్లో వస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, మార్కెట్‌కు అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో పని చేసే ఉద్యోగులకు సేవా తత్పరత అవసరమని సూచించారు.

కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ డా.ఎల్. విజయ కృష్ణా రెడ్డి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి సీఎస్‌టీడీ ఆఫీసర్ ఇన్‌చార్జి డా.పరాంకుశం వెంకటరమణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సీఎస్‌టీడీ ఆధ్వర్యంలో అధ్యాపకేతర సిబ్బందికి, టెక్నికల్ ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డా.బి.ఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి

పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంతో రోడ్‌షోలు

- టూరిజం మలేషియా డైరెక్టర్ జనరల్ దాతుక్ మనోహరన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మలేషియాకు రికార్డు స్థాయిలో 10 లక్షల మంది భారతీయ పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంతో ముందుకు వెళ్తునట్లు టూరిజం మలేషియా డైరెక్టర్ జనరల్ దాతుక్ మనోహరన్ పెరియాసామి అన్నారు. మలేషియా టూరిజం ఫిబ్రవరి 3-7 తేదిల్లో హైదరాబాద్, బెంగుళూర్, కొచ్చి నగరాల్లో టూరిజం రోడ్‌షోలు నిర్వహిస్తుందని వెల్లడించారు. అందులో భాగంగా సోమవారం ట్యాంక్‌బండ్ మ్యారెట్ హోటల్‌లో మలేషియాకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహరన్ పెరియాసామి మాట్లాడుతూ భారతదేశం ఇరువై ఏళ్లుగా మలేషియాకు కీలకమైన మార్కెట్‌గా నిలుస్తుందన్నారు. 2026 వరకు 16 లక్షల భారతీయ పర్యాటకులకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. భారత్ నుంచి వారానికి 151 విమానాలు, 26668 సీట్లు మలేషియాకు ఉన్న డిమాండ్‌ను సూచిస్తున్నాయన్నారు. వివాహ పర్యటనలు, విహారయాత్రలకు మలేషియా ప్రధాన గమ్యస్థానంగా నిలుస్తుందన్నారు. మలేషియా చెన్నై డైరెక్టర్ హిషాముద్దీన్ ముస్తఫా మాట్లాడుతూ హైదరాబాద్, బెంగుళూరు, కొచ్చి నగరాలు మాకు చాలా ప్రాముఖ్యత కలిగిన మార్కెట్లు అని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టూరిజం మలేషియా డైరెక్టర్ జనరల్ దాతుక్ మనోహరన్ పెరియాసామి

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందాల తనిఖీ

- నారాయణగూడ, లక్డీకపూల్ హోటళ్లలో పాడైన ఆహార పదార్థాల గుర్తింపు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కమిషనర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ బృందాలు నారాయణగూడలోని ఇండియన్ దర్బార్ రెస్టారెంట్‌లో సోమవారం తనిఖీలు నిర్వహించాయి. కిచెన్‌లో అప్రాన్ లేకుండా ఫుడ్ హ్యాండ్లర్లు, ఉడకబెట్టిన కోడిగుడ్లు కాలువల దగ్గర ఎలాంటి మూత లేకుండా ఉంచినట్లు గుర్తించారు. వంటగదిలో బొద్దింకలు, ఫ్రిజ్‌లో పాడైన ఆహార పదార్థాలు, కుళ్లిన టమాటా, పచ్చిమిర్చి, క్యారెట్‌లు గుర్తించడంతో పాటు స్టోర్ రూంలో ఆహారపదార్థాలతో పాటు శానిటరీ వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. ఆహార పదార్థాల నిర్వహణకు సంబంధించిన మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందుబాటులో లేవన్నారు. సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడినట్లు గుర్తించడంతో పాటు 2024 మార్చితో గడువు ముగిసిన మసాల పౌడర్ - 3 ప్యాకెట్లు, జీలకర పోడి-3.5 కిలోలు, పీచ్ ఫ్లేవర్డ్ సిరప్‌లు గుర్తించారు.

లక్డీకపూల్‌లోని హోటల్ అశోకాలో...

లక్డీకపూల్‌లోని హోటల్ అశోకాలో తనిఖీలు నిర్వహించిన అధికారులు వంటగది గోడలు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. వంటగదిలో బొద్దింకలు, దుర్వాసన రావడం గుర్తించారు. వంటగది రిఫ్రిజిరేటర్‌లో తుప్పుపట్టిన పాత్రలు, తయారుచేసిన వస్తువుల్లో సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగించినట్లు గుర్తించారు. 140 మందికి పైగా పనిచేస్తునప్పటికీ శిక్షణ పొందిన సూపర్‌వైజర్ లేకపోవడం, గడువు ముగిసిన పలు ఆహారపదార్థాలు గుర్తించారు. నీటి నాణ్యత తెలిపే నివేదికలు లేకపోవడాన్ని గుర్తించి నోటీసులు జారీచేశారు.



హోటళ్లలో గుర్తించిన పాడైన కూరగాయలు, ఆహార పదార్థాలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా లంకల దీపక్‌రెడ్డి

బంజారహిల్స్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకలాపాలను విస్తృతంగా ప్రజలల్లోకి తీసుకపోయి పార్టీ నిర్మాణానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి అన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా లంకల దీపక్‌రెడ్డి ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర నేత రామచంద్ర రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన దీపక్‌రెడ్డిని శాలువ కప్పి, పూల బోకేతో అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నేత రామచంద్ర రెడ్డి మాట్లాడుతు ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కంబాల గంగారాజు, కిలారి మనోహర్‌తో పాటు కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.


కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని బోరబండలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నగర కాంగ్రెస్ మహిళ నాయకురాలు హబీబా సుల్తానా, కాంగ్రెస్ నాయకులు -బోరబండ, ఆంధ్రజ్యోతి

ప్రైవేట్ బస్సు ఢీకొని భర్త మృతి.. భార్యకు తీవ్రగాయాలు

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనగా భర్త మృతి చెందాడు. భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆబిడ్స్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లాలగూడకు చెందిన సంత జసంత ఆమె భర్త ఆడోమ్ క్యారమ్(67) బైక్‌పై బషీర్‌బాగ్ చౌరస్తా మీదుగా ఆబిడ్స్ చాపెల్‌రోడ్డులో వెళ్తుండగా ఆరెంజ్ ట్రావెల్స్‌కు చెందిన (ఎన్ఎల్ 01బీ2900) బస్సు అతివేగంగా రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొంది. ఎల్బీస్టేడియం, అగ్రికల్చర్ కమిషనర్ కార్యాలయం ముందు జరిగిన ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు వచ్చి భార్యాభర్తలను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆడోమ్ క్యారమ్ మృతి చెందగా, అతని భార్య తీవ్ర గాయాలతో చికిత్స పొందుతుంది.

సంత జసంత చాపెల్‌రోడ్‌లోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తుంది. భార్యను స్కూల్‌లో దింపేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంపై మృతుడి కుమారుడు క్రిస్టోఫర్ క్యారమ్ ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, బస్సును అబిడ్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ పింగాళి ఉషారాణికి


ఉషారాణిని అభినందిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి

నిమ్స్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ పింగాళి ఉషారాణికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అకాడమి అవార్డు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భారత దేశ క్లినికల్ పరిశోధన రంగంలో చేసిన కృషికి నిమ్స్ క్లినికల్ ఫార్మాకోలజీ థెరప్యూటిక్ విభాగాధిపతి, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ పింగాళి ఉషారాణికి భారత క్లినికల్ పరిశోధన సమాఖ్య (ఐఎస్‌సీఆర్) 'లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ - అకాడమి అవార్డు'తో సత్కరించారు. ఈ సందర్భంగా సోమవారం డాక్టర్ ఉషారాణి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి అభినందించారు. ఇటీవల నిర్వహించిన 18వ వార్షిక సదస్సులో ఈ అవార్డును అందజేశారు. మూడు దశాబ్దాలుగా ఆమె క్లినికల్ పరిశోధన అభివృద్ధికి నైపుణ్య వృద్ధికి ఆమె కీలక పాత్ర పోషించారని నిమ్స్ వర్గాలు తెలిపాయి. ఆమె నిర్వహించిన పరిశోధనాత్మక క్లినికల్ ట్రయల్ వర్క్‌షాప్, సెమినార్, క్లినిక్ పరిశోధన నిపుణుల మార్గదర్శకత్వం అందించడం, క్లినికల్ ఫార్మాకోలాజీ, థెరప్యూటిక్ విభాగాన్ని అభివృద్ధి చేయడంలో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పురస్కారం కృషికి గుర్తింపుగా భావిస్తున్నట్లు చెప్పారు. తనను ప్రోత్సహించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పకు కృతజ్ఞతలు తెలిపారు.


సరస్వతీ పూజలో పాల్గొన్న గ్రంథ పాలకుడు, పాఠకులు

గ్రంథాలయంలో సరస్వతీ పూజ

బోరబండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): యువత వార్షిక పుస్తకాల చదువుతో పాటు సామాజిక అంశాలతో కూడిన పుస్తక పఠనం చేయాలని రహ్మత్‌నగర్ గ్రంథ పాలకుడు శ్రీనివాస్ అన్నారు. వసంత పంచమి సందర్భంగా సరస్వతీ మాత చిత్ర పటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.


కృష్ణ కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ అనిల్ కుమార్ యాదవ్

సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎర్ర కృష్ణ కుమార్

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎర్ర కృష్ణ కుమార్‌ను నియమిస్తున్నట్లు ఎంపీ, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్ ప్రకటించారు. సోమవారం అనిల్ కుమార్ యాదవ్ నియామక పత్రాన్ని ఎర్ర కృష్ణ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేయడానికి జిల్లాల వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఎర్ర కృష్ణ కుమార్ మాట్లాడుతూ సికింద్రాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌లకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఛైర్మన్ మొహమ్మద్ మోసిన్ ఖురేషి , కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ విభాగం వైస్ ఛైర్మన్ మొహమ్మద్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్ తుకారాంగేట్ ఇందిరాలక్ష్మీ నగర్ బస్తీలో పేరుకపోయిన మట్టికుప్పలను తొలగించాలని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన జీహెచ్ఎంసీ సిబ్బంది సోమవారం ఉదయం మట్టికుప్పలను తొలగించారు. రాకపోకలు అంతరాయం లేకుండా సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.


చెత్తను తొలగించిన జీహెచ్ఎంసీ సిబ్బంది

వైభవంగా హరిహర నామస్మరణ సంఘం వార్షికోత్సవం


కంటోన్మెంట్ బోర్డు మెంబర్ జె.రామకృష్ణకు జ్ఞాపికను అందజేస్తున్న హరిహర నామ స్మరణ సంఘం ప్రతినిధులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ పికెట్ గార్డెన్‌లో సోమవారం శ్రీహరిహర నామస్మరణ సంఘం 59వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ పాల్గొని శివ, కేశవులకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు శివకేశవుల పూజ, సహస్ర నామార్చన, భగవన్నామ సంకీర్తన, పారాయణం వంటి ప్రత్యేక కార్యక్రమాలలో శ్రీహరిహర నామస్మరణ సంగంలోని 600 మంది సభ్యులు పాల్గొని శివకేశవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జె.రామకృష్ణ మాట్లాడుతూ 59 సంవత్సరాలుగా హరిహర నామస్మరణ చేస్తూ హైందవ సమాజాన్ని జాగృతం చేస్తున్న సంఘం వారి కృషి ఎనలేనిదని అన్నారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ కొప్పునూరి బసప్ప, అధ్యక్షులు సోమ నాగరాజు, ప్రధాన కార్యదర్శి హన్మంతరావు, రామమూర్తితో పాటు సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.


డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న రామకృష్ణ

ఇచ్చిన మాట నెరవేర్చేది బీజేపీ నాయకులే: రామకృష్ణ

సికింద్రాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట నెరవేర్చేదే బీజేపీ నాయకులేనని, ఇతర పార్టీల నాయకుల మాదిరిగా అబద్ధాలు చెప్పడం తమకు రాదని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. రెండోవార్డు ఇందిరమ్మనగర్ పోచమ్మ ఆలయం వెనుక సోమవారం ఆయన పర్యటించి, బస్తీవాసుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మురుగునీటి సమస్య పరిష్కారానికి డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం తాను బస్తీలో పర్యటించనప్పుడు మురుగు సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు తనకు ఫిర్యాదు చేశారని, వారికి ఇచ్చిన మాట ప్రకారం యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్టు వెల్లడించారు. నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతో కంటోన్మెంట్‌ను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రజల కోసం పని చేసే బీజేపీకి ప్రజలు అండగా నిలవాలని, ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్, మాదారపు అశోక్, రేఖ, శ్యామ్, జైయాదవ్, ప్రశాంత్, జహంగీర్ పాల్గొన్నారు.

'ఈగల్' సభ్యుడిగా పవన్‌ఖేరా నియామకంపై హర్షం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎంపవర్డ్ యాక్షన్ గ్రూప్ ఆఫ్ లీడర్స్ అండ్ ఎక్స్‌పర్ట్స్ (ఈగల్) సభ్యుడిగా నియమితులైన ఆలిండియా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా చైర్మన్ పవన్‌ఖేరా ఆ పార్టీ తెలంగాణ ప్రచార కమిటీ చీఫ్ కో-ఆర్డినేటర్ గంట సుధీర్ కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను సత్కరించారు. సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ పాల్గొన్నారు.


పవన్‌ఖేరాను కలిసిన గంటా సుధీర్‌కుమార్

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలి


విద్యుత్ అధికారి బ్రహ్మానందానికి సమస్య వివరిస్తున్న మర్రి పురూరవరెడ్డి

పద్మారావునగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి భోలక్‌పూర్ కృష్ణానగర్ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి, దాని స్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ యువనాయకులు మర్రి పురూరవరెడ్డి విద్యుత్ డీఈకి ఫిర్యాదు చేశారు. సోమవారం డివిజన్ నాయకులతో కలిసి గాంధీ ఆసుపత్రి సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో డీఈ బ్రహ్మానందంను కలిసి సమస్యను వివరించి త్వరగా పరిష్కరించాలని వారిని కోరారు. స్పందించిన ఆయన తగిన చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు.


నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

బీమా వైద్యసేవల ఉద్యోగులు నిరసన

పద్మారావునగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ, ఇన్సూరెన్ మెడికల్ సర్వీసెస్ ఉద్యోగులకు ఈఎస్ఐ సొసైటీ ప్రతిపాదన అమలు చేయటానికి పూనుకొని అన్యాయం చేస్తున్నాయని, దీంతో ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ భోజన విరామ సమయంలో నల్ల బాడ్జీలు ధరించి, ఈఎస్ఐ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద 7 రోజులుగా నిరసన ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. ఈఎస్ఐ సొసైటీ ఏర్పాటు ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలియజేశారు.

వాహనదారుల్లో అవగాహన పెరగాలి

తుకారాంగేట్ చౌరస్తాలో తికమక పడుతున్న వాహనదారులు

సూచిక బోర్డులు చూసి వెళ్లండి: ట్రాఫిక్ సీఐ భాస్కర్


తుకారాంగేట్ చౌరస్తాలో తికమకపడుతున్న ప్రాంతం ఇదే

అడ్డగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నలబై ఏళ్ల సమస్య ఆర్‌యూబీ బ్రిడ్జితో తుకారాంగేట్ ప్రజలు ఆశ నెరవేరింది. తుకారాంగేట్ చౌరస్తాలో ఎనిమిది నెలల క్రితం ట్రాఫిక్ సమస్యలు తీర్చడానికి సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు నేతృత్వంలో ఆర్‌యూబీ బ్రిడ్జి నిర్మాణంతో తుకారాంగేట్, అడ్డగుట్ట, మారేడుపల్లి, మహేంద్రహిల్స్, సఫిల్‌గూడ, హనుమాన్‌పేట్, మల్కాజిగిరి లాలాగూడ శాంతినగర్, మెట్టుగూడ ప్రజలకు ప్రయాణం సులువుగా మారింది. తుకారాంగేట్ చౌరస్తా ఆర్‌యూబీ బ్రిడ్జి ముందు రైల్వే ఆర్మీ ట్రాక్ ఉండడంతో తుకారాంగేట్ నుంచి వెళ్లే వాహనదారులు న్యూ మిర్జాలగూడ, లాలాగూడ మెట్టుగూడ నుంచి వచ్చే వాహనాలు తుకారాగేట్ చౌరస్తా వరకు రాగానే వాహనదారులు తికమక పడుతున్నారు. చిన్న చిన్న దారులు ఉండడం నాలుగు వైపులా ఒకే దారిలో రావడం ఉదయం సాయంత్రం వేళలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడంతో స్థానికంగా తీవ్ర ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఎటు వైపు వెళ్లాలో అర్థం కానీ పరిస్థితి నెలకొంది. తుకారాగేట్ నుంచి హనుమాన్‌పేట్, న్యూ మిర్జాలగూడ, సఫిల్‌గూడ వైపు వెళ్లే వాహనాలు, అటు నుంచి తుకారాంగేట్ నుంచి వచ్చే వాహనాలు ఒకే దారి, మెట్టుగూడ నుంచి తుకారాంగేట్ వైపు వచ్చే వాహనదారులు, లాలాగూడ రైల్వే స్టేషన్ నుంచి వచ్చే వాహనాలు తుకారాంగేట్ చౌరస్తాలో అన్ని వాహనాలు కలుస్తుంటాయి.

సూచిక బోర్డుల ఏర్పాటు

తుకారాంగేట్ చౌరస్తాలో ఆర్మీ పట్టాల వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఉందని బీజేపీ పార్టీ సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో బస్తీవాసులు, వివిధ పార్టీల నాయకులు అందరు కలిసి వారం క్రితం మారేడుపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌ను కలిసి తాము సూచిక బోర్డులు ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. స్పందించిన సీఐ భాస్కర్ ఆనందం వ్యక్తం చేస్తూ తుకారాంగేట్ ప్రజలు ఐక్యంగా కలిసి సొంత ఖర్చులతో సూచిక బోర్డులు ఏర్పాటు చేసుకోవడం మంచి నిర్ణయం అని అభినందించారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన సమయంలో బస్తీవాసుల పిలుపు మేరకు మారేడుపల్లి ట్రాఫిక్ సీఐ భాస్కర్ సమస్య ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. సూచిక బోర్డులను చూసి వాహనదారులు క్యూ పద్ధతిని పాటించాలని కోరారు.



నాలుగు రోజుల క్రితం ఆర్‌యూబీ వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు

ఎవరు ఎలా వెళ్లాలి...

సఫిల్‌గూడ, హనుమాన్‌పేట్ నుంచి తుకారాంగేట్ వైపు వచ్చే వాహనాలు లాలాగూడ రైల్వే స్టేషన్ మీదుగా తుకారాంగేట్ వైపు చుట్టుతిరిగి రావాలి, తుకారాంగేట్ నుంచి ఇతర ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలు ఆర్‌యూబీ పక్క నుంచి వెళ్లాల్సి వస్తుంది. హనుమాన్‌పేట్ నుంచి ఆర్టీసీ బస్సులు, కార్లు, ఇతర భారీ వాహనాలు సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన తరువాత లాలాగూడ రైల్వే స్టేషన్ మీదుగా తుకారాంగేట్ వైపు వస్తున్నాయి. లాలాగూడ శాంతినగర్ నుంచి హనుమాన్‌పేట్ వైపు వాహనాలు వెళ్లాలంటే ఆర్‌యూబీ పక్క నుంచి వెళ్లాల్సి ఉంటుంది. సూచిక బోర్డులను చూసిన వాహనదారులు కొందరు క్యూ పద్ధతిని పాటిస్తున్నారు.

చౌరస్తాలో తికమక పడుతున్నారు



తుకారాంగేట్ చౌరస్తాలో ఉదయం సాయంత్రం వేళలో వాహనదారులు తికమక పడుతు ప్రమాదాల బారిన పడుతున్నారు. తామే సూచిక బోర్డుల ప్రకారం వెళ్లాలంటూ సూచిస్తున్నాం. ఉదయం సాయంత్రం వేళలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. రెండు రోజుల నుంచి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూస్తున్నాం. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడితే వెంటనే ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నాం.

- అల్లం సునీల్, బీఎస్‌సీ

ట్రాఫిక్ సీఐ వెంటనే స్పందించారు



తుకారాంగేట్‌లో ఆర్‌యూబీ బ్రిడ్జి ప్రారంభించినప్పటి నుంచి చౌరస్తాలో వాహనదారులు తికమక పడుతున్నారు. తాను మారేడుపల్లి ట్రాఫిక్ సీఐ భాస్కర్ వద్దకు వెళ్లి వినతిపత్రం సమర్పించాను. వెంటనే స్పందించారు. కొంత మంది దాతల సాయంతో మూడు సూచిక బోర్డులు ఏర్పాటు చేశాం. ఇంకా వాహనదారుల్లో అవగాహన కలగాలి.

- నర్సింగ్‌రావు, తుకారాంగేట్

కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలి



తుకారాంగేట్ చౌరస్తాలో ఉదయం సాయంత్రం వేళలో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. మూడు రోజుల క్రితం సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాహనదారుల్లో ఇంకా అవగాహన రావాల్సి ఉంది. సూచిక బోర్డులతో వాహనదారుల్లో చైతన్యం రావాలి.

- సౌందర్య, బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు

కేంద్ర బడ్జెట్‌తో సమ్మిళిత అభివృద్ధి

ట్యాక్స్ నిపుణులు పీవీఎస్ఎస్ ప్రసాద్

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ సాధించే లక్ష్యంతో భారతదేశ వృద్ధిని వేగవంతం చేసేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ 2025 - 26 ఆర్థిక స్థితిస్థాపకతను బలోపేతం చేయడంతో పాటు సమ్మిళిత అభివృద్ధిని సృష్టిస్తుందని ప్రముఖ టాక్స్ నిపుణులు పీవీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో కేంద్ర బడ్జెట్ 2025-26 పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ప్యానల్ చర్చ నిర్వహించింది. ఈ చర్చలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకాగా రెండు తెలుగు రాష్ట్రాల ట్యాక్స్ నిపుణులు, చార్టెడ్ అకౌంటెంట్లు, ట్యాక్స్ కన్సల్టెంట్‌లు, ట్యాక్స్ అడ్వకేట్లు పాల్గొని కేంద్ర బడ్జెట్‌ను స్వాగతించారు. ఈ సందర్భంగా పీవీఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ... కేంద్ర బడ్జెట్‌లో గణనీయమైన సంస్కరణలను తీసుకువచ్చి రూ.12 లక్షల వరకు ఆదాయంపై ఎటువంటి ఆదాయపు పన్నును చెల్లించకుడదనే ప్రకటన మధ్య తరగతి వర్గాలకు, వేతన జీవులకు, పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కలిగిస్తుందన్నారు. మౌలిక సదుపాయాలలో పెట్టుబడి, డిజిటలైజేషన్, సామాజిక సంక్షేమం వంటి అనేక పరివర్తన కార్యక్రమాలను హైలైట్ చేస్తుందన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్ వేముల మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలసీతారామన్ దూరదృష్టితో వికసిత్ భారత్ సాధనలో బడ్జెట్ 2025లో పన్నులను సరళీకృతం చేసిందని, అద్దె ఆదాయానికి రూ.50 వేల వరకు టీడీఎస్ మినహాయింపునివ్వడం ఫిజికల్ లోటు, రెవెన్యూ లోటును నియంత్రించడం ప్రశంసనీయమైన చర్య అన్నారు. చర్చలో అసోసియేషన్ సలహాదారు రాందేవ్ బూత్రా, పూర్వ అధ్యక్షులు అమృత్ కుమార్ కోట, కౌన్సిల్ సభ్యులు పంకజ్ సంచేటి, సాంబమూర్తి, కోశాధికారి ఆశిష్, సోమేశ్వర్, రమణరెడ్డి, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ట్యాక్స్ నిపుణులు పీవీఎస్ఎస్ ప్రసాద్

ముగ్గురు దొంగల అరెస్ట్

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మహాకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో దుకాణాల షట్టర్‌లు ఎత్తి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యులు గల ముఠాను పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. సోమవారం మహాకాళి ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ సర్దార్‌సింగ్ కేసు వివరాలను వెల్లడించారు. మహాకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్ బోయిగూడలోని దీపక్ ఇంజనీరింగ్ కంపెనీలో షట్టర్‌ను ఓపెన్ చేసి, లాకర్‌లోని 30 లక్షలా 20 వేల రూపాయలను ఫిబ్రవరి 1 తెల్లవారుజామున దొంగిలించారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న మహాకాళి డివిజన్‌లోని మహాకాళి, రాంగోపాల్‌పేట్, మోండా పోలీసులు తమ సిబ్బందితో ఓ టీమ్‌ను ఏర్పాటు చేశారు. సీసీ ఫుటేజ్, మొబైల్ నెట్‌వర్క్ సిగ్నల్స్ ఆధారంగా చోరీకి పాల్పడ్డ వారి కదలికలను గుర్తించి సికింద్రాబాద్‌లోని సితార లాడ్జీలో ఒక నిందితుడిని పట్టుకొన్నారు. అతడిని విచారించి మిగతా ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.28 లక్షలా 62 వేలను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర భీవండికి చెందిన మురళీధర్ మోహన్‌లాల్‌శర్మ (39), యూపీ జాన్‌పూర్‌కు చెందిన చంద్రభాన్‌పటేల్(39), ఉదయ్ రాజ్‌సింగ్(48)లపై కేసు నమోదు చేశారు. వీరు గతంలో సికింద్రాబాద్ ప్రాంతంలో టెక్స్‌టైల్ వ్యాపారం చేసేవారని, లాక్‌డౌన్ సమయంలో వీరి వ్యాపారం నష్టపోవడంతో సికింద్రాబాద్ ప్రాంతంలో భారీ నగదు లావాదేవీలు జరుగుతాయని తెలిసిన దోపిడీకి ప్లాన్ చేశారు. సులభంగా డబ్బు సంపాదించొచ్చని అయిన మురళీధర్ మోహన్‌లాల్‌శర్మ ప్రోత్సహించడంతో చంద్రభాన్ పటేల్, ఉదయ్ రాజ్ సింగ్ ఈ దోపిడీకి పాల్పడ్డారని తెలిపారు. చోరీ జరిగిన రెండు రోజుల్లోనే ముఠాను పట్టుకున్న మహాకాళి ఇన్‌స్పెక్టర్ పరశురామ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఎస్ఐలు గంగాధర్, శ్రీవర్ధన్‌లతో పాటు మూడు పోలీస్ స్టేషన్ పరిధిలోని సిబ్బందిని ఏసీపీ అభినందించారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదును ప్రదర్శిస్తున్న ఏసీపీ సర్దార్‌సింగ్

రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి విలేజ్ సమీపంలో సూర్యదేవాలయంలో నేడు రథసప్తమిని పురస్కరించుకుని నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. సోమవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ దేవాలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబులకు దేవాలయం పరిసర ప్రాంతాలలో భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మురళీ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఉల్లాసాన్ని కలిగిస్తాయి

డాక్టర్ కోట నీలిమ


విజేత టీమ్‌కు కప్‌ను అందజేస్తున్న కోట నీలిమ

పద్మారావునగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జేఎం వీసి స్పోర్ట్స్ ఫుట్‌బాల్ టోర్నమెంటును బోయగూడలోని సెయింట్ ఫిలోమినా పాఠశాల మైదానంలో సెల్వరాజ్, ఆంథోని విన్సెంట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ టోర్నమెంటులో విజేతలుగా నిలిచిన మోతీనగర్‌లోని డాన్ బాస్కో హైస్కూల్ విద్యార్థులకు కప్‌ను సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అంజేశారు. రన్నర్లుగా నిలిచిన వీఆర్ఎస్, సెంట్ మేరీస్ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ.. క్రీడలు పిల్లలకు, యువతకు ఆనందాన్ని మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటుగా ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి



గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న జ్ఞానసరస్వతి దేవాలయంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు


భక్తులకు సూచనలు ఇస్తున్న ధర్మాధికారి కళాజనార్దనమూర్తి

వందల సంఖ్యలో అక్షరాభ్యాసాలు.. కిక్కిరిసిన ఆలయ పరిసరాలు

పద్మారావునగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జ్ఞానసరస్వతి జన్మదినాన్ని పురస్కరించుకొని వసంత పంచమి (పంచమి) వేడుకలు గాంధీ ఆసుపత్రి ఎదురుగాగల సరస్వతీ దేవాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో సరస్వతీ హోమం, సర్వపూజ, అమ్మవారికి విశేష పంచామృత అభిషేకం, అష్టోత్తరనామార్చన వంటి పత్యేక పూజా కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. హైదరాబాద్ నగరం నలుమూలల నుంచే కాకుండా తెలంగాణలోని అనేక జిల్లాల నుంచి అక్షరాభ్యానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం అమ్మవారిని వాహనసేవ ద్వారా పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించినట్లు ఆలయ ధర్మాధికారి కళా జనార్దన మూర్తి తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

లష్కర్‌లో ఘనంగా వేడుకలు


వసంత పంచమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి వేడుకలు లష్కర్‌లో ఘనంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వసంత పంచమిని పురస్కరించుకుని చిన్నారులతో అక్షరాభ్యాసం చేశారు. టివోలి వద్దనున్న అక్షర వాగ్దేవి స్కూల్‌లో వసంత పంచమి సందర్భంగా హోమం, సరస్వతి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

మహాకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్ ఇందిరాలక్ష్మినగర్ బస్తీలోని ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఆలయ వార్షిక ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శత కలశాభిషేకం, గణపతిపూజ, చండీహోమం, అన్నదానం, సాయంత్రం కుంకుమార్చన వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


మహాకాళి ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు